క్లుప్తంగా

కెలిబిలో వైద్యశిబిరం



రక్త నమూనాలు సేకరిస్తున్న సిబ్బంది

కెరమెరి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కెలిబి గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించినట్లు వైద్యాధికారి రియాజ్ తెలిపారు. 31 మందిని పరీక్షించి రక్త నమూనాలు సేకరించినట్లు పేర్కొన్నారు. సూపర్‌వైజర్ మెస్రం సోము, హెచ్‌ఏలు వసంత్, శంకర్, ఏఎన్‌ఎం రాధ, లక్ష్మి తదితరులున్నారు.

'ఇసుక అక్రమ రవాణా అరికట్టాలి'

రెబ్బెన: మండలంలోని రాంపూర్ గ్రామ సమీపంలోని మార్కెట్ యార్డు వద్ద కొనసాగుతున్న అక్రమ ఇసుక రవాణాను వెంటనే అరికట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మార్కెట్ యార్డు వద్ద నుంచి కొంత కాలంగా ఇసుక అక్రమ రవాణా జరుతున్నా రెవెన్యూ, భూగర్భగనులు, పోలీస్ శాఖలు పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇసుక అక్రమ రవాణాదారులు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండా వాగుల నుంచి ఇసుకను తోడేస్తూ రవాణా చేస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారని ఆరోపించారు. ఇసుక అక్రమ దందా చేస్తున్న వారిని వెంటనే నిలువరించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

నూతన కార్యవర్గం

రెబ్బెన: మండలంలోని పుంజుమేరగూడలోగల భూవమ్మతల్లి దేవస్థాన నిర్వహణ కమిటీని శుక్రవారం గ్రామస్తుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వినోద్ జైస్వాల్, ఉపాధ్యక్షుడిగా వడాయి కాంతారావు, కార్యదర్శిగా గుర్లె బాలాజీ, ఉప కార్యదర్శిగా వడాయి గొండయ్య, ప్రచార కార్యదర్శిగా మోర్లె నరసింహ, ముఖ్య సలహాదారులుగా వడాయి శివరాం, గుర్లె విస్సయ్య, కార్య నిర్వహణ సభ్యులుగా బొడ్డు రాజు, వడాయి భీంరావు, అదె మధూకర్, గుర్లె సత్తన్న, కొట్రంగి హన్మంతు, వడాయి పాపయ్య, వడాయి గణపతి, వడాయి రవి ఎన్నికయ్యారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంగీత అన్నారు. శుక్రవారం కళాశాలలో మాదకద్రవ్యాలను వ్యతిరేకిస్తూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఆమె మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తుపదార్థాలకు అలవాటుపడి యువత బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మాదకద్రవ్యాల నివారణ కోఆర్డినేటర్ రమేశ్, లెక్చరర్లు సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి



నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి జూలై 7తో 31 సంవత్సరాలు గడుస్తున్నందున ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్ మాదిగ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని గడియార్‌గార్, ఇంద్రనగర్, మావలలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ సమాజం పట్ల బాధ్యతతో ప్రభుత్వాలతో విరోచితమైన పోరాటాలు చేసిందన్నారు. నాయకులు శరత్, గంగన్న, విఠల్, కృష్ణపల్లి రాజేశ్వర్, చిన్నయ్య, ప్రదీప్, రాజేశ్వర్, ప్రశాంత్, నాని పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో మాట్లాడారు. సీతాగొంది, కజ్జర్ల, బరంపూర్, రుయ్యాడి, తాంసి, తలమడుగు, నిపాని, అర్లి(టి), గిమ్మ, పెండల్‌వాడ, చప్రాల, సాంగిడి, ఆనంద్‌పూర్, దీపాయిగూడ, భోరజ్, రాంపూర్, దస్నాపూర్, ఖానాపూర్, పొన్నారి, కైలాస్‌నగర్ పరిధిలోని సబ్‌స్టేషన్‌లలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిచి ఉంటుందని పేర్కొన్నారు.

వేతన వెతలు

- మూడు నెలలుగా అందని వేతనాలు
- ఇబ్బందుల్లో పారిశుద్ధ్య కార్మికులు
- కుటుంబ పోషణకు ఆర్థికభారం



ధనోరాలో చెత్తను ట్రాక్టర్‌లో వేస్తున్న కార్మికుడు

కెరమెరి: గ్రామాల స్వచ్ఛతలో కీలకపాత్ర పోషిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు మూడు నెలలుగా జీతాలు అందడం లేదు. కుటుంబ పోషణ భారమై ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న ఎంపీడబ్ల్యూ వర్కర్లు ఆందోళన చెందుతున్నారు. ప్రతీనెల వేతనాలు అందించాలని డిమాండ్ చేస్తున్నారు. మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 89 మంది పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు.

ఉత్సాహంగా పాల్గొంటున్నా..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన స్వచ్ఛసర్వేక్షణ్, పల్లె ప్రగతి కార్యక్రమాల్లో కార్మికులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ పనులు చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో మురికి నాలీలు శుభ్రం చేయడం, చెత్తాచెదారాన్ని ఎత్తివేయడం, రోడ్లు శుభ్రపర్చడం, ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయడం, బురదలో బ్లీచింగ్ పౌడర్ వేయడం వంటి వివిధ పనులు చేస్తున్నారు. శ్రమను గుర్తించి అధికారులు తక్షణమే వేతనాలు ఇవ్వాలని వారు కోరుతున్నారు. ప్రస్తుతం నెలకు రూ.9,500 చెల్లిస్తుండగా వారి రోజు ఖర్చుల రీత్యా వేతనాలు పెంచాలంటూ డిమాండ్ చేస్తున్నారు. జీతాల పెంచే విషయమై అధికా రులకు పలుమార్లు వినతిపత్రాలు అందించినా ఫలితం లేకపోయిందని వాపోతున్నారు. అత్యవసరాలు, పెళ్లిళ్లకు వేతనాలు సరిపోక అప్పులు చేస్తున్నామన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క తమ సమస్యలపై దృష్టిపెట్టాలని, తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు. కనీస వేతనం రూ. 20 వేలు చెల్లించి ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. నెలల తరబడి నిరసన కార్యక్రమాలు చేసఉతన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నా రు. పెరిగిన ఖర్చులు దృష్టిలో పెట్టుకుని తమకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.

కుటుంబ పోషణకు భారం



నెలనెల వేతనాలు రాక అనేక ఇబ్బందులు పడుతున్నాం. వచ్చే అరకొర అయినా సమయానికి వస్తే ఉపయోగం ఉంటుంది. జీతాల రాకపోవడంతో కుటుంబ పోషణకు భారంగా ఉంది. కనీసం వేతనాలు రూ.20 వేలు పెంచాలి. – పొర్ల స్వామి, ఎంపీడబ్ల్యూ, కెరమెరి జీపీ

ఉన్నతాధికారుల దృష్టికి..



వేతనాల విషయమై ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే పారిశుద్ధ్య కార్మికుల ఖాతాల్లో జమచేస్తాం. కొంత ఆలస్యమైనా అన్నినెలలకు కలిపి ఒకేసారి వచ్చే అవకాశం ఉంది. – అంజద్‌పాషా, ఎంపీడీవో, కెరమెరి

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కౌటాల: పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని గుడ్లబోరి, తుమ్మిడిహెట్టి, వీర్దండి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. నాణ్యత ప్రమాణాలు పాటించి ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. ఎంపీవో మహేందర్‌రెడ్డి, ఏఈ బద్రుద్దీన్, కార్యదర్శులు భాస్కర్, సురేశ్, నాయకులు వసంత్‌రావు, తిరుపతి, బండు తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న సిద్దల దేవయ్య, అధికారులు

నానో యూరియాతో రైతులకు లాభాలు

కాగజ్‌నగర్‌రూరల్: నానో యూరియాతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేసి అవగాహన కల్పించారు. నానో యూరియా పిచికారీ చేస్తే నేరుగా మొక్కలకు చేరుతుందన్నారు. భూమి సారం పెరుగుతుందని, ఎరువుల మందులతో కలిపి నానో యూరియాను సులువుగా పిచికారీ చేసుకోవచ్చని తెలిపారు. పర్యావరణానికి కూడా ఎలాంటి హాని కలిగించదని పేర్కొన్నారు. రైతులకు పంట సాగుపై ఎలాంటి సందేహాలు ఉన్నా తమను సంప్రదించాలని సూచించారు.



నానో యూరియాపై అవగాహన కల్పిస్తున్న ఏవో

పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలి

తాంసి: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున వర్షపు నీరు నిల్వ లేకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో మోహన్ రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని హస్నాపూర్ గ్రామంలో డ్రైడేలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో పంచాయతీ సిబ్బందితో ఇంటింటా తిరుగుతూ ఇళ్ల పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. ఎంపీవో లింగయ్య, మాజీ సర్పంచ్ నర్సింగ్, పంచాయతీ కార్యదర్శి లావణ్య రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

'ఉపాధి' పనుల్లో అక్రమాలు



సిబ్బందిని ప్రశ్నిస్తున్న అధికారులు

కెరమెరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కొనసాగిన 13వ విడత ఉపాధిహామీ ప్రజావేదిక వాడీవేడిగా కొనసాగింది. మండలంలోని 31పంచాయతీల్లో 536 పనులకు రూ.8.79కోట్లు ఖర్చు చేశారు. పక్షం రోజులుగా 10మంది డీఆర్పీలు, 30 మంది వీఎస్ఏలు క్షేత్రస్థాయిలో చేపట్టిన పనులకు తీసుకున్న కొలతల్లో అనేక తేడాలు వచ్చాయి. కొన్ని ప్రాంతాల్లో అరకొరగా పనులు జరిగినప్పటికీ పూర్తి నిధులు ఖర్చు చేశారు. డీఆర్పీలు పరిశీలించిన అంశాలను అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. అన్ని గ్రామపంచాయతీల్లో చేసిన పనులకు తేడాలు వచ్చాయి. మస్టర్లు లేకుండానే పనులు చేస్తే మరికొన్ని చోట్ల అధికారులు, కూలీల సంతకం లేకుండానే పేమెంట్ చేశారు. చాలా చోట్ల నర్సరీల్లోని మొక్కలు చనిపోయాయి. అవెన్యూ మొక్కలది కూడా అదే పరిస్థితి. సరాసరి మండలం మొత్తం 50 శాతం మొక్కలు బతకలేదని డీఆర్పీలు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో పని చేసిన వారికి కూలి డబ్బులు రాకపోగా చేయని వారికి అందించినట్లు తనిఖీ అధికారులు విస్తుపోయే విషయాలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కెరమెరిలో ఆరు జాబ్‌కార్డులకు సంబంధించిన కూలీలకు ఒక్కొక్కరికి రూ.200 చొప్పున ఇచ్చి మిగతా డబ్బులు కాజేసినట్లు చెప్పారు. మరికొన్ని చోట్ల కూలీలకు తెలియకుండానే డబ్బులు స్వాహా అయినట్లు తెలిపారు. కాగా, మండలంలో 602 డబుల్ జాబ్‌కార్డులు జారీ అయినట్లు డీఆర్పీలు గుర్తించారు. వాటికి సంబంధించిన రూ.41 లక్షలు అధిక పేమెంట్ అయినట్లు తెలిపారు. కెరమెరి గ్రామపంచాయతీలోనే 252 జాబ్‌కార్డులు జారీ అయినట్లు పేర్కొన్నారు. ప్రజలు, కూలీలు లేకుండానే అధికారులతోనే ప్రజావేదిక కొనసాగడం గమనార్హం.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

అవకతవకలకు పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర సామాజిక తనిఖీ డైరెక్టర్ నిర్మల, ఆసిఫాబాద్ డీఆర్డీవో బీ దత్తారాం తెలిపారు. అవకతవకలకు పాల్పడిన సంబంధిత సిబ్బంది నుంచి సొమ్ము రికవరీ చేస్తామని పేర్కొన్నారు. ఎంపీడీవో అజ్జద్‌పాషా, డీపీవో ఆంజనేయులు, హెచ్‌ఆర్ అకౌంటెంట్ మల్లేశ్, ఎస్‌ఆర్‌పీ రవియాదవ్, ఏపీవో మల్లయ్య, ఈజీ అక్యానాయక్ తదితరులున్నారు.

జోరుగా నీళ్ల దందా!

- మినరల్ పేరుతో దోపిడీ
- గొంతులో విషం పోస్తున్న వైనం
- జిల్లా కేంద్రంలో పుట్టగొడుగుల్లా ప్లాంట్లు
- బీఎస్ఐ గుర్తింపు లేకుండా నిర్వహణ



ఆసిఫాబాద్‌రూరల్: మినరల్ ప్యూరిఫైడ్ ఫ్రెష్ డ్రింకింగ్ వాటర్‌కు ప్లాంట్ల నిర్వాహకులు పెట్టిన పేర్లు వినడానికి బాగున్నా.. రుచి చూస్తే మాత్రం పచ్చి అబద్ధమని తెలుస్తోంది. శుద్ధి చేసిన తాగునీరు పేరుతో కొందరు జిల్లాలో అక్రమ దందా కొనసాగిస్తున్నారు. గుక్కెడు మంచినీళ్లు గరళంగా మారుతున్నాయి. గొంతు తడుపుకొనేందుకు ఒక్కో కుటుంబం నెలకు రూ.వందల్లో వెచ్చించాల్సి వస్తోంది. విచ్చలవిడిగా వెలుస్తున్న నీటిశుద్ధి కేంద్రాల (ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్లు) పై అధికారుల నిఘా కరువైంది. బీఎస్ఐ స్టాండర్డ్ గుర్తింపు లేకుండానే ప్లాంట్ల నిర్వాహకులు వ్యాపారం చేస్తున్నారు. అపరిశుభ్రమైన నీళ్లలో కెమికల్స్ కలిపి జనాల గొంతులో విషం పోస్తున్నారు.

ఇదీ తయారీ పద్ధతి

ముందుగా బోరులోని నీటిని ట్యాంక్‌లోకి నింపి క్లోరినేషన్ చేయాలి. తర్వాత శాండ్ ఫిల్టర్‌లో శుభ్రం చేయాలి. కార్బన్ ఫిల్టర్‌లో శుభ్రం చేసి రివర్స్ ఆస్మాసిస్ చేయాలి. మినరల్స్‌ను జత చేసి ఓజోనైజేషన్ జరపాలి. అల్ట్రావైయోలెట్ రేడియేషన్ ద్వారా శుద్ధి చేసి నమూనాలు తీయాలి. మైక్రో బయాలజీ, కెమిస్ట్ ప్రయోగశాలలో పరీక్షించాలి. ఆ తర్వాత క్యాన్లు, బాటిళ్లలోకి తీసుకోవాలి. కానీ.. ఇవి ఏ వాటర్ ప్లాంట్లలో జరగడం లేదు. నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సంబంధిత అధికారులు కూడా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. పారిశుద్ధ్య విభాగం అధికారులు పర్యవేక్షిస్తే అసలు బాగోతం బయట పడే అవకాశముంది.

నిబంధనలకు నీళ్లు..

- వాటర్‌ప్లాంట్లలో ఎయిర్ కండీషనర్లతో పాటు కెమికల్ ల్యాబ్, మైక్రోబయోలజీ ల్యాబ్, వాటర్ ఫిల్లింగ్ గది, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ (బీఎస్ఐ) నిబంధనలకు అనుగుణంగా ప్లాంట్ పూర్తిగా స్టెయిన్‌లెస్ స్టీల్‌తో ఉండాలి.
- సంబంధింత అధికారులు ప్రతీ మూడు నెలలకోసారి ఆయా ప్లాంట్లలో తనిఖీలు నిర్వహించి నమూనాలను సేకరించి పలు రకాల పరీక్షలు నిర్వహించాలి. సంతృప్తికరంగా ఉంటే లైసెన్స్‌లు ఇవ్వాలి. అంతకుముందే లైసెన్స్ ఇచ్చి ఉంటే రెన్యూవల్ చేయాలి.
- ప్లాంట్ నిర్వహణతో పాటు బాటిళ్లు, ప్యాకెట్లకు కూడా ప్రత్యేకంగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. వాటర్ ప్యాకెట్లు, 20 లీటర్ల క్యాన్లపై కంపెనీల పేర్లు, ఫోన్ నంబర్లు, తయారు తేదీలే ముద్రించని సంస్థలు, అపరిశుభ్రమైన నీళ్లను అమ్ముతున్నారు.
- వాటర్ ప్లాంట్లు అందించే నీటిలో కోలీఫామ్స్, ఫ్లోరైడ్, బ్యాక్టీరియా, సుడోమోనాస్, ఫంగే తదితరాలుంటాయని ఆరోపణలు వస్తున్నాయి.

పాఠశాలకు సామగ్రి వితరణ

రెబ్బెన: మండలంలోని గంగాపూర్ ఉన్నత పాఠశాలకు శుక్రవారం ఎస్‌హెచ్‌ఐఎఫ్ స్వచ్ఛంద సేవా సంస్థ, స్కీనెల్డర్ ఎలక్ట్రిక్ ఆర్థిక సహాయంతో స్మైల్ ఫౌండేషన్ రూ.2లక్షల విలువైన వస్తువులను అందజేసింది. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం అబ్దుల్ లతీఫ్ మాట్లాడుతూ.. వెనుకబడిన జిల్లాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలనే సంకల్పంతో ఎస్‌హెచ్‌ఐఎఫ్ స్వచ్ఛంద సేవా సంస్థ, స్కీనెల్డర్ ఎలక్ట్రిక్ సంస్థ జిల్లాలో 10 ఉన్నత పాఠశాలలను ఎంపిక చేసినట్లు తెలిపారు. వాటిలో గంగాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ ఒకటని పేర్కొన్నారు. పాఠశాలకు సోలార్ ప్యానెల్ సిస్టం, 50 ఇంచుల టీవీ, సౌండ్‌సిస్టం, వైఫై సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఫౌండేషన్ ప్రతినిధులు

అంబులెన్స్‌లో ప్రసవం

బజార్‌హత్నూర్: మండలంలోని గోకొండ గ్రామానికి చెందిన గర్భిణి బరద్వల్ సోని శుక్రవారం పురిటినొప్పులతో బాధపడుతుండడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో నొప్పులు ఎక్కువయ్యాయి. పైలెట్ రాజారాం వాహనాన్ని పక్కకు నిలిపివేయడంతో ఈఎంటీ సురేశ్ ఈఆర్‌సీపీ డాక్టర్ కసిరెడ్డిని ఫోన్‌లో సంప్రదించారు. అతని సూచనల మేరకు పురుడు పోశారు. అనంతరం రిమ్స్‌లో తల్లీ, బిడ్డను చేర్చారు. ఇద్దరు ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

రేపు అగ్నివీర్ మాక్‌టెస్ట్

బోథ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం ఉదయం 10 గంటలకు మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ, సోల్జర్స్ గ్రూప్ ఆధ్వర్యం లో అగ్నివీర్ ఆర్మీ ఉచిత మాక్ టెస్ట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ మాసం అనిల్ కుమార్ తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు. మరిన్ని వివరాలకుకు మాసం అనిల్ కుమార్ 9533650208, సోల్జర్స్ గ్రూప్ ఫౌండర్ కృష్ణ 9492622956 నంబర్‌లకు సంప్రదించాలని తెలిపారు.

తెగిన కల్వర్టు.. రాకపోకలకు అంతరాయం



ఆసిఫాబాద్‌రూరల్: రాజుర గ్రామానికి వెళ్లే దారిలోని కల్వర్టు ఇటీవల కురిసిన వర్షానికి తెగిపోయింది. దీంతో గ్రామస్తులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని తెగిపోయిన కల్వర్టుకు మరమ్మతులు చేపట్టి ఇబ్బందులు లేకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.



మొలకెత్తిన ఆశలు

దహెగాం: ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే వర్షాలు కురిసి మురిపించి ముఖం చాటేశాయి. వర్షాలు కురుస్తున్నాయని రైతులు పొలాలు సిద్ధం చేసి పత్తి విత్తనాలు విత్తుకున్నారు. విత్తుకున్న విత్తనాలు మొలకెత్తక పోవడంతో ఆందోళనలో పడ్డ రైతులకు వర్షం ఊరటనిచ్చింది. రెండు రోజుల క్రితం మండలంలో మోస్తారు వర్షాలు కురువడంతో విత్తిన పత్తి విత్తనాలు మొలకెత్తాయి. వరి సాగు కోసం మొలక అలకడానికి రైతులు పొలాలు సిద్ధం చేస్తున్నారు. మృగశిర కార్తెలో విత్తుకున్న విత్తనాలు పూర్తిస్థాయిలో మొలకెత్తక పోవడంతో మరోసారి పత్తి విత్తనాలు విత్తుకుంటున్నారు.

అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను పార్ట్‌టైమ్ ప్రతిపాదికన భర్తీ చేయడానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమన్వయ అధికారిని లలిత కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. భౌతిక, రసాయన, మ్యాథ్స్ సబ్జెక్టుల్లో పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్‌తో పాటు బీఎడ్ విద్యార్హత కలిగి ఉండాలన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో జూలై 1న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ఉదయం 10 గంటలకు హాజరుకావాలన్నారు. డెమో ద్వారా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని తెలిపారు.